# ఫలాలు

వారణాసి రామకృష్ణ


**కథ**

స్కూటర్ స్టార్ట్ చేసి బైటికెళ్ళబోతూ సుందరం యధాలాపంగా ఓసారి ప్రక్కింటి గేటు కేసి చూశాడు. ఆ ఇల్లు సుందరం స్నేహితుడు జానకిరాంది! ఇద్దరూ మంచి ఫ్రెండ్స్! ఐదేళ్ళ క్రిందట ఒకేసారి రెండు ఇళ్ళూ కట్టుకున్నారు. ఇంట్లో చేరాక సంవత్సరం కూడా కాకుండానే జానికిరాం అమెరికా వెళ్ళిపోయాడు.

అంత కష్టపడి కట్టుకున్న ఇంటిని వదిలి వెళ్ళటం ఒక ప్రక్క బాధ కలిగించినా అమెరికన్ డాలర్ ఆకర్షణలో పడిపోయాడు. జానకిరాం వెళ్ళాక సుందరమే ఆ ఇంటి సంగతులు చూస్తున్నాడు.

అయితే అద్దెకి దిగిన వాళ్ళెవరూ సరిగ్గా ఉండటం లేదు. దాదాపు ఆరునెలలుగా ఆ ఇల్లు ఖాళీగా ఉంది.

గేటువంక చూసిన సుందరం ఉలిక్కిపడి గేటుకున్న తాళం విరిగిపడి పోవటం మరోసారి పరీక్షగా చూసి. ''సుశీలా, సుశీలా! అరెరె..గేటు తాళం విరిగిపోయిందేమిటి?'' అంటూ భార్యని కేసేసి పిలుస్తూ స్కూటర్ స్టాండ్ వేసి జానకిరాం ఇంటి వైపుకెళ్ళాడు. గేటు తెరిచి లోనికెళ్ళి ఇంటికి నలువైపులా ఉన్న ప్రదేశాన్ని గమనించసాగాడు. అక్కడంతా గడ్డి, పిచ్చిమొక్కలు బాగా పెరిగాయి.



పెరట్లో ఒక వైపుగా మామిడి చెట్టు ఉంది. దాన్ని జానకిరాం, సుందరంలు ఇద్దరూ కలిసి ఇంట్లోకి దిగిన కొత్తల్లో నాటారు. అదిప్పుడు బాగా ఏపుగా పెరిగి పెద్ద వృక్షంలా ఉంది. చెట్టంతా కాయలతో కళకళలాడుతోంది.

మామిడి చెట్టుని చూస్తూ సుందరం-''సుశీలా! చూశావా...చెట్టు నిండా కాయలే! ఇప్పుడు వాడుగానీ చూస్తే ఎంత సంతోషించేవాడో!'' స్నేహితుడ్ని తలుచుకున్నాడు.

''అది సరేగానీ..ఏమండీ ఈ గడ్డి, పిచ్చిమొక్కల్ని మనిషిని పెట్టి తీయించేసి తోటకాస్త శుభ్రం చేయిద్దామండీ!''

''వద్దు సుశీలా! ఈ పిచ్చిమొక్కలు అవి ఉండటం కూడా ఒకందుకు మంచిదే! లోపలికెవ్వరూ రారు! పైగా ఈ మామిడికాయలు కోసుకుపోదామని కూడా ఎవ్వరూ సాహసించి లోనికి దూరరు'' చిట్టడవిలా ఉన్న పొదల్ని చూస్తూ సుందరం అన్నాడు.

తాళాన్ని తెచ్చి వేసి ఇద్దరూ వచ్చేశారు.

సుందరం ఆఫీసుకెళ్ళబోతుండగా ఫోను మ్రోగింది.

అవతల్నించి జానకిరాం! సుందరం తన మిత్రుడితో మామిడిచెట్టు గురించి చెప్పగానే జానకిరాం ఎంతో సంతోషపడ్డాడు.

''ఒరే సుందరం! ఒక పని చెయ్యరా! కనీసం ఓ పాతిక కాయలు కోయించి చక్కగా ప్యాక్ చేసి నాకు పంపించు!'' జానకిరాం కోరిక వినగానే సుందరంకి కూడా ఆ ఐడియా చాలా బాగుందనిపించింది.

''తప్పకుండా! మరో వారం రోజులు ఆగితే కాయలు బాగా పెద్దవి అయి ముదురుతాయి! ఆ వెంటనే కోయించి పంపుతానులే!'' చెప్పాడు.

వారం రోజులు గడిచాయి. ఈ వారంలో మరో పదిసార్లు జానకిరాం అమెరికా నుంచి ఫోన్ చేస్తూ, అతని ఇంట్లోని మామిడి చెట్టుని, దానికి కాస్తున్న కాయల్ని గురించి వాకబు చేస్తూనే ఉన్నాడు.

సుందరం మామిడికాయలు ప్యాక్ చెయ్యటం కోసమని గడ్డి, కాగితాలు ఒక చెక్కపెట్టె తీసుకువచ్చేడు. కూలి మనిషిని మాట్లాడి కాయలు కోయించాలని జానకిరాం ఇంటి గేటు తాళం తీసి లోపలికెళ్ళాడు.

వెనుక తోటలో మామిడి చెట్టు వైపు చూసి ఒక్కసారి గతుక్కుమన్నాడు. అంతకుముందు రోజు వరకు చెట్టునిండా కాయలతో, కళకళలాడిన మామిడి చెట్టు బోసిగా విషాదంగా నిలబడి చూస్తున్నట్టుంది!

అంతలా కాపలా కాసినా ఎలా జరిగిందో అర్థంగాక సుందరం నిర్ఘాంతపోయాడు. సుశీల కూడా అర్థం కానట్టు నిలబడిపోయింది.

ఇద్దరికీ ఏం చెయ్యాలో తోచలేదు. ఇంతలో మళ్ళీ జానకిరాం దగ్గర్నించి ఫోన్!

జానకిరాంకి ఏం చెప్పాలో అర్థంగాక మౌనంగా ఊర్కున్నాడు సుందరం.

''ఆదేంట్రా! ఉలుకు పలుకు లేకుండా ఉన్నావేంటి? కాయలింకా కోయించలేదా? మనిషి దొరకలేదా?'' అరుస్తున్నాడు గట్టిగా.

సుందరం వెంటనే తేరుకుని ''లేదురా! ఇప్పుడే కోయిస్తున్నాను. ఇంతలోనే నీ దగ్గర్నించి ఫోన్ వస్తే, పరుగెత్తుకొస్తున్నాను! అంతే'' అనేశాడు.

''వెరీగుడ్! మా తోటలో కాయలు ఇక్కడి అమెరికాలో ఉండి తినటం అనే భావనే అద్భుతంగా ఉందిరా! వెంటనే పంపు!'' అంటూ అతను ఫోన్ పెట్టేశాడు.

సుశీల భర్తకేసి ఆశ్చర్యంగా చూసి ''అదేంటి అలా చెప్పారు? పాపం అతను వాళ్ళ తోటలోని కాయల కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటాడు'' అన్నది.

దాదాపు పదిహేనురోజుల తర్వాత. ఓ అర్ధరాత్రి జానకిరాం ఫోన్ చేశాడు.

సుశీల ఫోన్ తీసింది. అవతల్నించి జానకిరాం తెగ ఉత్సాహంగా మాట్లాడుతూ, ''ఏమ్మా సుశీలా! వాడు ఎలా ఉన్నాడు? ఏం చేస్తున్నాడు?'' అడిగాడు.

''నిద్రపోతున్నారు అన్నయ్యగారూ!'' సుశీల భయంగా చెప్పింది. అతనెక్కడ వాళ్ళ మామిడికాయల ప్రసక్తి తెస్తాడోనన్నట్టు!

''అలాగా! వాడిని నిద్రలేపకులే! రేపు మళ్ళీ చేస్తాను! మీరు పంపించిన మా తోటలోని మామిడిపండ్లు ఇందాకే అందరమూ తిన్నాము! అబ్బ..ఎంత తియ్యగా ఉన్నాయో! మీ వదినకి మామిడిపళ్ళు అంత ఇష్టంలేదని నీకూ తెలుసుగా. కానీ అది కూడా ఎంతిష్టంగా తిన్నదో! ఏమైనా మీకు నా థ్యాంక్స్! మా ఇల్లు, తోట చక్కగా చూసుకుంటున్నారు. అంతేగాక మా తోటలోని పళ్ళ రుచి కూడా చూపిస్తున్నారు! మెనీ మెనీ థ్యాంక్స్..మళ్ళీ ఉదయం ఫోన్ చేస్తాను!'' జానకిరాం చెబుతుంటే విభ్రాంతిగా సుశీల ఫోన్ పెట్టేసింది.

గదిలో పడుకుని ఉన్న సుందరం భార్యని చూసి చిరునవ్వు నవ్వేడు.

''మీ స్నేహితుడేంటండి! మామిడి పళ్ళు తిన్నానని చెప్తున్నాడు..మీరు పంపేరని అంటున్నాడు. అసలు విషయం ఆయనకింకా తెలీదా?'' సుశీల ఆందోళనగా అన్నది.

''పిచ్చిదానా! కాయలు ఎవరో కోసుకుపోయారని చెబితే వాడెంత వర్రీ అవుతాడో మనకి తెలీదూ! అందుకే చెప్పలేదు.''

''మరి...మరి''

''నీ సందేహం నాకర్థమయిందిలే! మార్కెట్లో పళ్ళు కొని వాటినే వాడికి పంపాను!''

''ఆ! అయినా అదేంటండి అలా చేశారు'' సుశీల బాధగా అన్నది.

''చూడు సుశీ! జీవితంలో కష్టపడేదొకడు. సుఖపడేది మరొకడు! ఒకడు తన కష్టం తాలూకు ప్రతిఫలం కొంతవరకే అనుభవించగలడు! ఈ జీవిత సత్యం మనకి తెలుసు! కానీ జానకిరాం దాన్ని ఒప్పుకోడు. అందుకే వాడికి అంత హైరానా! వాడి సంగతి తెలిసి కూడా వాడినెందుకు మనం బాధపెట్టాలి? వాడ్ని సంతోషంగా ఉంచటం కోసమే ఆపని చేశాను! వాడికక్కడ తింటున్న ఆ ఫలాలు ఇక్కడి ఏ రైతు తన పొలంలో అహర్నిశలు కష్టించగా పండిన ఫలాలో! అయితే వాడికీ విషయం తెలిస్తే- ఆ ఫలాల్లోని తియ్యదనం చేదుగా తోస్తుంది! అవునా కాదా?''

వేదాంత ధోరణిలో చెబుతున్న భర్తవంకసుశీల ఆప్యాయంగా చూసింది! ★